క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ నబీ రసూల్

బొమ్మనహాళ్: వాహన చోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ నబీర సూల్ అన్నారు. శుక్రవారం కళ్యాణదుర్గం - బళ్లారి అంతరాష్ట్ర రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదకరమైన మలుపులు ఉన్న చోట సూచనలు పాటించాలన్నారు. వాహన డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు ఇలా.. రాకపోకలు ఎలా?



చేపలవీధికి వెళ్లేదారిలో ధ్వంసమైన కల్వర్టు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డు మటన్ మార్కెట్ నుంచి చేపల వీధికి వెళ్లే రహదారిలోని కల్వర్టు సగానికి పైగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇసుక ట్రాక్టర్ దిగబడడంతో కల్వర్టు ధ్వంసమైంది. అప్పటి నుంచి ఆ వీధిలో రాకపోకలకు పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రాత్రివేళలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి ఉంది.

అక్రమ కేసులు పెడితే సహించేది లేదు



కాంతారెడ్డిని పరామర్శిస్తున్న మెట్టు విశ్వ

రాయదుర్గం: అక్రమ కేసులు పెడితే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి అన్నారు. అక్రమ కేసులో అరెస్టయి కళ్యాణదుర్గం సబ్ జైలు నుంచి విడుదలైన వైఎస్సార్‌సీపీ గుమ్మఘట్ట మండల కన్వీనర్ గొని కాంతారెడ్డిని గొల్లపల్లిలోని స్వగృహంలో శుక్రవారం పరామర్శించారు. అనంతరం విశ్వ మాట్లాడుతూ కాంతారెడ్డి కుటుంబానికి పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. అరెస్టయినప్పటి నుంచి విడుదలయ్యే వరకు సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రారెడ్డి, కార్యదర్శి గరుడచేడు గోపాల్‌రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాయదుర్గం పట్టణం, మండలం, డి హీరేహాళ్, కణేకల్లు మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రామాంజినేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సీనియర్ నాయకులు కోకూర్తి జయరామిరెడ్డి, బూత్ అధ్యక్షుడు అంజిరెడ్డి, రవూఫ్, గుమ్మఘట్ట సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

చీకట్లో కంటి వెలుగు

- కూటమి సర్కార్ ఏర్పాటయ్యాక కంటి వైద్య సేవలు నిలిపివేత
- సీహెచ్‌సీల్లో మూతపడిన ఈ–ఐ కేంద్రాలు
- కొత్త టెండర్లు పిలిచే వరకు కంటి వైద్య సేవలు బంద్



ఉరవకొండ: సరేంద్రియాణం నయనం ప్రధానం అన్న మాటకు కూటమి సర్కార్ తూట్లు పొడిచింది. పేదలకు 'వెలుగు' చూపాల్సిన ప్రభుత్వం..పథకాన్ని చీకట్లోకి ఉంచింది. చూపులేకపోతే లోకమంతా చీకటే. చూపు మందగించినా జీవనం కష్టమే. దీన్ని దృష్టిలో ఉంచుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని 2019 అక్టోబర్ 10న అనంతపురంలోనే ప్రారంభించింది. మొదటి దశలో 70 లక్షల మంది పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 1.58 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ‘కంటి వెలుగు’ను అపోలో సంస్థ ద్వారా నిర్వహించేవారు. గతేడాది సెప్టెంబర్ 4వతేదీతో సంస్థతో ఒప్పందం ముగిసింది. అయితే అప్పటి నుంచి ప్రస్తుత ప్రభుత్వం ఏజెన్సీ సంస్థను పునరుద్ధరించలేదు. కనీసం వేరే ఏజెన్సీకీ అప్పగించలేదు.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 18 సీహెచ్‌సీల్లో ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం నిలిచిపోయింది. 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ప్రారంభించిన ఈపథకం కింద మూడు విడతల్లో 48,209 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఇందులో 17,595 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. 60 ఏళ్లు పైబడిన 88,670 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, రికార్డు స్థాయిలో 41,670 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించి, వారికి ఉచితంగా అద్దాలు అందించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఎంతోమందికి వెలుగులు నింపారు.

సీహెచ్‌సీల్లో నిలిచిపోయిన సేవలు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సీహెచ్‌సీల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించేవారు. ఒక్కో సీహెచ్‌సీలో 30 నుంచి 50 మంది వరకు కంటి పరీక్షలు చేసి, వారికి కావాల్సిన అద్దాలు ఉచితంగా అందించేవారు. కళ్లల్లో పొరలు, శుక్లాలు ఉన్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేవారు. దీంతో అప్పట్లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు ఎంతో ఆదరణ ఉండేది.

నిలిచిపోయిన కంటి వైద్య సేవలు: కంటి వెలుగు కార్యక్రమాన్ని అపోలో సంస్థ ద్వారా నిర్వహించేవారు. గతేడాది సెప్టెంబర్ 4తో ఆ సంస్థతో ఒప్పందం ముగిసింది. అయితే అప్పటి నుంచి కూటమి ప్రభుత్వం ఏజెన్సీ సంస్థను పునరుద్ధరించలేదు. ప్రత్యామ్నాయంగా వేరే ఏజెన్సీకి అప్పగించలేదు. ఈ–ఐ కేంద్రాల్లోని అత్యాధునిక కంటి పరీక్షల యంత్రాలు, కంప్యూటర్లను ఏజెన్సీ సంస్థ తరలించుకుపోయింది. దీంతో నిరుపేదలు, వయోవృద్ధులు కంటి పరీక్షలు చేయించుకోవడానికి ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రైవేట్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకుందామంటే వేలాది రూపాయలు ఖర్చు చేసే స్థోమత లేక అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కేవలం వైద్యులను సంప్రదించడానికి ఓపీకే రూ.300 ఖర్చు పెట్టి, కళ్లద్దాల కోసం రూ.1,000 నుంచి రూ. 2వేలు అదనపు ఖర్చు వస్తుందని భయపడుతున్నారు.



ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి పరీక్ష చేస్తున్న కంటి వైద్య నిపుణుడు (ఫైల్)

జగన్ చలువతోనే కంటి చూపు



చూపు మందగించి చాలా మంది డాక్టర్లకు చూపించా. వారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేక అవస్థలు పడ్డాను. వైఎస్ జగన్ బాబు సీఎం కాగానే పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేయించి, నాకు కంటి చూపు ప్రసాదించారు. – గోవిందమ్మ, బెళుగుప్ప

రోజూ తిరుగుతున్నా



కంటి అద్దాలు తీసుకోవడానికి వారం రోజుల నుంచి ఉరవకొండ ఆస్పత్రికి తిరుగుతున్నా. మిషన్లు లేవు అంటూ వెనక్కి పంపుతున్నారు. రోజూ ఉరవకొండకు రావడానికి ఖర్చులు పెట్టుకొని తిరగాలంటే కష్టంగా ఉంది. – ఎల్లమ్మ, మోపిడి గ్రామం

చూపు మందగించింది..



కొంచం దూరంలో ఉన్న వారిని గుర్తించలేక పోతున్నా. చూపు పూర్తిగా మందగించి అవస్థలు పడుతున్నాను. ఆస్పత్రికి వస్తే తాళాలు వేసి ఉంటారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే స్థోమత లేదు. – లక్ష్మి, పాల్తూరు

ఏజెన్సీ పునరుద్ధరించగానే సేవలు



రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలు పునరుద్ధరించగానే మెరుగైన కంటి వైద్య సేవలు ప్రజలకు అందుతాయి. ప్రస్తుతం ఆటో రెఫరేషన్ మోషీన్‌తో పాటు ఇతర యంత్రాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం కొత్త ఏజెన్సీను కుడా దాదాపు రెండు రోజుల్లో ఖరారు చేయనుంది. – డాక్టర్ ఎస్‌వీఎస్ చౌదరి, మెడికల్ ఆఫీసర్, ఉరవకొండ

'టీడీపీ నాయకుడి ఆగడాలకు అడ్డుకట్ట వేయండి'

బ్రహ్మసముద్రం : టీడీపీ నాయకుడు శంకర్ గౌడ్ ఆగడాలకు అడ్డుకట్ట వేసి, తమకు న్యాయం చేయాలని మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామానికి చెందిన బాధిత దళితులు కోరారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని నాగభూషణం గౌడ్‌కు చెందిన సర్వే నంబర్ 218 -2బీలో 4.96 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన దళితుడు రామప్పకు ల్యాండ్ సీలింగ్ కింద ఇచ్చారు. రామప్పతోపాటు అదే గ్రామానికి చెందిన మరో కుటుంబానికి కూడా నాగభూషణం గౌడ్ మిగులు భూమి నుంచి 2.50 ఎకరాలు ల్యాండ్ సీలింగ్ కింద పంపిణీ చేసి, చట్ట ప్రకారం రికార్డులు కూడా మార్చి డీ పట్టా ఇచ్చారన్నారు. అయితే నాగభూషణంగౌడ్ ల్యాండ్ సీలింగ్ కింద దళితులకు భూమి ఇవ్వడం ఇష్టంలేక నిరాకరించాడు. రామప్పతో పాటు మరో లబ్ధిదారుడికి ల్యాండ్ సీలింగ్ కింద భూమిని పంపిణీ చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా సాగులో మాత్రం నాగభూషణం గౌడ్ కుమారుడు శంకర్ గౌడ్ ఉన్నాడు. ఈ భూమిని తమకు ఇవ్వాలని రామప్ప కుమారుడు చన్నమల్ల పోరాడుతున్నా అందుకు శంకర్‌గౌడ్ అడ్డుకుంటున్నాడని, తమపై దాడులు కూడా చేయించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం

రాయదుర్గంటౌన్:రైతులు, ప్రజలు, కర్షకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు సాగిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున తెలిపారు. శుక్రవారం సీపీఐ 5వ నియోజకవర్గ మహాసభ జరిగింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక వినాయక సర్కిల్ నుంచి శాంతినగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆజీజియా షాదీమహాల్‌లో సదస్సు నిర్వహించారు.

నూతన కమిటీల ఎన్నిక : పట్టణ కమిటీ కార్యదర్శిగా రవీంద్ర, సహాయ కార్యదర్శిగా శంకర్ తోపాటు 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గుమ్మఘట్ట మండల కార్యదర్శిగా తిప్పేస్వామి, సహాయ కార్యదర్శిగా రామాంజనేయులు, డీ.హీరేహాళ్, కణేకల్లు మండల కమిటీలను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, కోశాధికారి ఆంజనేయులు, సీపీఐ నాయకులు దుర్గన్న, గౌస్‌పీరా, హనుమంతు, సర్మాస్, నరసింహులు పాల్గొన్నారు.



కంబదూరులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కనుల పండువగా మల్లేశ్వరస్వామి రథోత్సవం

కళ్యాణదుర్గం : కంబదూరు మండల కేంద్రంలోని కమల మల్లేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అశేష జనవాహిని మధ్య కనుల పండువగా సాగింది. ఆలయంలో అర్చకులు మంత్రోచ్చారణ నడుమ శివపార్వతులకు తొలి పూజలు చేశారు. పల్లకీపై స్వామిని ఊరేగించారు. ఉత్సవ మూర్తులను రథంపై ప్రతిష్టించి, రథోత్సవం నిర్వహించారు. కంబదూరు వీధుల్లో శివ నామస్మరతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఈఓ దేవదాస్, ఆలయ చైర్మన్ గాజుల హనుమంతరాయుడు, కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోమా నుంచి కోలుకుని ఇంటికి

అనంతపురం మెడికల్: గులియన్ బరీ సింద్రోమ్‌తో బాధపడుతూ కాళ్లు, చేతులు, మాట పడిపోయి కోమా స్టేజ్‌లో ఆస్పత్రిలో చేరిన కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ నాగేంద్ర కోలుకోవడంతో మెడిసిన్ వైద్యులు శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. ఈ నెల 7న సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకురాగా మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్ అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో అడ్మిట్ చేసుకుని అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు, స్టాఫ్‌నర్సుల పర్యవేక్షణలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించిన విషయం తెలిసిందే. ఈ నెల 14న ఆరోగ్యం కుదుట పడడంతో మేల్ మెడిసిన్ వార్డుకు తరలించారు. అక్కడ ఐదు రోజుల పాటు వైద్యులు, స్టాఫ్‌నర్సులు సేవలందించారు. పూర్తి స్థాయిలో కోలుకున్న నాగేంద్రను శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర, వారి కుటుంబీకులు డాక్టర్ భీమసేనాచార్ బృందానికి , స్టాఫ్‌నర్సులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి



వజ్రకరూరులో జనార్దన వేంకటేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో భక్తుల కొంగు బంగారం జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, నిత్యార్చనలు, పల్లకీసేవ, రథ హోమం, రథ ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం మడుగుతేరు నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. సాయంత్రం రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువుదీర్చారు. సర్పంచు మోనాలిసా, ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య తదితరులు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేలాదిమంది భక్తుల న డుమ నమో వేంకటేశాయ, గోవిందా..గోవిందా అంటూ రథాన్ని ముందుకు లాగారు. స్థానిక ఆలయం నుంచి రథాన్ని గంజికుంటలో రోడ్డులో ఉన్న వి ద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వరకు రథాన్ని లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. రథం కదులుతున్న సమయంలో భక్తులు రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చు కున్నారు. సీఐలు చిన్నగౌస్, మహానంది ఆధ్వర్యంలో ఎస్ఐలు నాగస్వామి, జనార్దన్‌నాయుడు, ఖాజాహుసేన్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు: గంగపుత్రుల ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు అందించారు.

కూల్‌డ్రింక్స్ పంపిణీ : జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు ఆధ్వర్యంలో భక్తులకు కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు.



కూల్ డ్రింక్స్ అందిస్తున్న దృశ్యం

అనంతరం బాలరామాంజనేయులు మాట్లాడుతూ రథోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారని, ఎండవేడిమిని దృష్టిలో ఉంచుకొని కూల్ డ్రింక్స్ అందించి నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



రాయదుర్గంలో సెయింట్ మేరీ చర్చిలో శిలువ మోస్తున్న ఫాదర్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది, మానవ హక్కుల నేర నిరోధక సంస్థ చైర్మన్ పాస్టర్ రాకేష్‌నాయక్



ఉరవకొండలో గుడ్‌ఫ్రైడే సందేశాన్ని ఇస్తున్న పాస్టర్లు



విడపనకల్లులో యేసు సందేశాన్ని ఇస్తున్న దైవ సేవకులు



శెట్టూరు మండలంలోని కనుకూరు విశ్వవాణి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: సర్వమానవుల పాప పరిహారార్థం శిలువనెక్కిన ఏసుప్రభువు త్యాగాన్ని స్మరించుకుంటూ శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చిల్లో శుభ శుక్రవారం ప్రార్థనలు జరిగాయి. ప్రపంచ మానవాళి రక్షణ కోసం మరణించిన ఏసు ప్రభువు శిలువ కాబడిన సందేశాన్ని చర్చిల్లో పాస్టర్లు, ఫాదర్‌లు భక్తులకు వివరించారు. పట్టణంలోని బీటీపీ రోడ్డులోని సెయింట్ మేరి మాత చర్చి, రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చి, జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్, క్రైస్ట్ చర్చి, 12వ వార్డులోని డాక్టర్ ఎస్ఆర్ జాన్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, నేసేపేటలోని ఎప్రాత ప్రార్థన మందిరం, జూనియర్ కళాశాల సమీపంలో గిల్గాలు చర్చి, బ్రదరన్ అసెంబ్లీ, హోసన్న ప్రార్థన మందిరాల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా బైబిల్ లేఖనాల పరిశోధన సదస్సు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని బైబిల్ లేఖనాల పరిశోధన సదస్సును నిర్వహించారు. చర్చి పాస్టర్ కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది, మానవ హక్కుల నేర నిరోధక సంస్థ చైర్మన్ పాస్టర్ రాకేష్‌నాయక్ (తెలంగాణ) హాజరై సందేశం ఇచ్చారు. మూడు రోజుల పాటు సదస్సు జరుగుతుందని పాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో సండే స్కూల్‌పిల్లలు, స్త్రీల మైత్రి సభ్యులు, యూత్ సభ్యులు, చర్చి అభివృద్ధి మండలి సభ్యులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. శెట్టూరు, అయ్యగార్లపల్లి, కనుకూరు, బచ్చేహళ్లి, లక్ష్మంపల్లి, అనుంపల్లి, కైరేవు గ్రామాల్లోని చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తుపడిన శ్రమలు, శిలువలో పలికిన ఏడు మాటలు, ఆయన త్యాగంపై ప్రత్యేక ధ్యానం చేశారు. విశ్వాసులు ఉదయం నుంచి ఉపవాసాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సోమశేఖర్, చిన్నారావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

చెడుపై మంచి విజయానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

కూడేరు: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకనే గుడ్ ఫ్రైడే అని కూడేరు బేతనీయ చర్చి పాస్టర్ విక్టర్ అన్నారు. శుక్రవారం కూడేరులోని బేతనీయ, కవనెంట్, జల్లిపల్లి, ఉదిరిపికొండ, కలగళ్ల, అరవకూరు, ఇతర గ్రామాల్లోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలలో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉరవకొండ: క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు ప్రతి ఒక్కరికీ గుర్తుకు వస్తాయని, లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రైడే అని ఉరవకొండ సీఎస్ఐ చర్చి పాస్టర్ ప్రమీలా జోసఫ్, ప్రత్యేక ప్రసంగీకులు జగదీష్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎస్ఐ చర్చితో పాటు మండల వ్యాప్తంగా అన్ని చర్చిల్లో శుభ శుక్రవారాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సభ్యులు షాహిన్, సాకేభాస్కర్, భాస్కర్‌బాబు, లాలు, రాజేశ్వరీ, ప్రసాద్, దావీద్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: సమాజంలో చెడును తొలగించడానికే యేసుక్రీస్తు జీవితాన్ని త్యాగం చేశారని పాస్టర్ డీఎస్ పాల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సీఅండ్ ఐజీఎం చర్చి, మండల వ్యాప్తంగా పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించి, గుడ్ ఫ్రైడేను జరుపుకున్నారు. పాస్టర్లు ఐజయ్య, డేవిడ్ చార్లెస్, సునీల్, జోషప్, చర్చి కమిటీ ప్రెసిడెంట్ చల్లా రాజశేఖర్, రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిశోర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: జగతికి శాంతి సందేశానిస్తూ క్రీస్తు శిలువనెక్కిన రోజైన గుడ్‌ఫ్రైడేను బొమ్మనహాళ్ మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బొమ్మనహాళ్‌తో పాటు ఉద్దేహాళ్, గోవిందవాడ, బండూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విడపనకల్లు: మండలంలో పాల్తూరు, విడపనకల్లు, హావళిగి, కరకముక్కల, గడేకల్లు, వేల్పుమడుగు, మాళాపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు. విడపనకల్లు, గలీలయ, దైవసేవకులు ధనుంజయ, ఉరవకొండ ఎఫ్రాతా ప్రార్థన మందిరంలో దైవ సేవకులు జాషువా, పులివెందులకు చెందిన బ్రదర్ బాబు, ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని యేసుక్రీస్తు శిలువను గూర్చి సెందేశాన్ని అందించారు. వేడుకల్లో పెద్ద ఎత్తున క్రైస్తవులు, పెద్దలు బ్రదర్ రాజు, బ్రదర్ అలెగ్జాండర్, బ్రదర్ జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.



కూడేరు: బేతనీయ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ విక్టర్



విడపనకల్లు: యేసుక్రీస్తును ఆరాధిస్తున్న క్రైస్తవులు



గోవిందవాడలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గాలీవాన బీభత్సం



పాల్తూరులో విరిగి పడిన 11 కేవీ విద్యుత్ స్తంభం

విడపనకల్లు:గడేకల్లు, చీకలగురికి, విడ పనకల్లు, పాల్తూరు, హంచనహాల్, ఎస్.తిమ్మాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలీవా న బీభత్సం సృష్టించింది. గడేకల్లులో 11 కేవీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎస్సీ కాలనీలో పురాతన చెట్లు విరిగిపడ్డాయి. బోయ వెంకటేశులకు చెందిన గాలిమిషన్ షెడ్ రేకులు ఎగిరిపోయాయి. చీకలగురికిలోనూ పలు చెట్లు నేలకొరిగాయి. పొలాల్లో నిల్వ చేసిన ఎండు మిర్చి తడిసిపోయింది.

అరటి తోట దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్: ప్రమాదవశాత్తు మంటలు చుట్టుముట్టి అరటి తోట దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన మేరకు... మల్లాపురం మహిళా రైతు కమలమ్మ మూడు ఎకరాల్లో రూ.4 లక్షల పెట్టుబడితో ఎనిమిదేళ్ల క్రితం అరటి మొక్కలు నాటారు. ప్రస్తుతం చెట్లు కాపు కాసి దిగుబడి కోత దశలో ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పక్క పొలానికి చెందిన రైతు తన పొలంలో ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి అరటి తోటను చుట్టుముట్టాయి. స్థానిక రైతులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఈ లోపు దాదాపు 150 అరటి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధత మహిళారైతు వాపోయారు.